తిలక్ తడాఖా

చెన్నైలో దుమ్మురేపిన హైదరాబాదీ • అర్ధ సెంచరీతో విజృంభణ

ఇంగ్లండ్‌పై రెండో టీ20లో భారత్ ఉత్కంఠ విజయం

తెలంగాణ కుర్రాడు తాకూర్ తిలక్‌వర్మ దుమ్మురేపాడు. విధ్వంసక ఇన్నింగ్స్‌తో తన దమ్మేంటో చేతల్లో చూపెట్టాడు. ఇంగ్లండ్ నిర్దేశించిన 166 పరుగుల లక్ష్యఛేదనలో 78 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న టీమ్‌ఇండియాను తిలక్ ఒంటిచేత్తో గెలిపించాడు. విజయంపై ఆశలు సన్నగిల్లిన వేళ తన విలువ చాటుతూ సహచర ప్లేయర్లతో కలిసి జట్టుకు చిరస్మరణీయ విజయాన్నందించాడు. అజేయ అర్ధసెంచరీతో చెలరేగిన తిలక్..గణతంత్ర దినోత్సవ వేళ దేశానికి అదిరిపోయే విజయాన్నందించాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుస విజయాలు ఖాతాలో వేసుకున్న టీమ్‌ఇండియా 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

తిలక్‌వర్మ (72 నాటౌట్)

చెన్నై: భారత్ ఖాతాలో మరో చిరస్మరణీయ విజయం. గెలుపుపై అసలు నమ్మకం లేని సమయాన యువ సంచలనం తిలక్‌వర్మ అన్నీతానై జట్టును ముందుండి నడిపించాడు. లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ ముప్పేట దాడికి ఓవైపు సహచర బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళుతున్న వేళ తనలోని పోరాటపటిమను వర్మ మరోమారు బయటకు తీశాడు. శనివారం ఆఖరి వరకు ఉత్కంఠ రేపిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ 2 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై అద్భుత విజయం సాధించింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 166 లక్ష్యఛేదనలో టీమ్ ఇండియా 8 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. తిలక్‌వర్మ(55 బంతుల్లో 72 నాటౌట్, 4ఫోర్లు, 5సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో విజృంభించాడు. సుందర్(19 బంతుల్లో 26, 3ఫోర్లు, సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. బ్రాండెన్ కార్స్(3/29) రాణించాడు. తొలుత కెప్టెన్ బట్లర్(45), కార్స్(31) ఆకట్టుకోవడంతో 20 ఓవర్లలో 165/9 స్కోరు చేసింది. అక్షర్‌పటేల్(32), వరుణ్ చక్రవర్తి(2/38) రెండేసి వికెట్లు తీశారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0తో ముందంజ వేసింది. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన తిలక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

తిలక్ ఒక్కడే:

ఇంగ్లండ్ నిర్దేశించిన లక్ష్యఛేదనలో టీమ్‌ఇండియాకు మెరుగైన శుభారంభం దక్కలేదు. ఆర్చర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో ఓపెనర్ అభిషేక్‌శర్మ(12) మూడు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. బుల్లెట్‌లా దూసుకొస్తున్న బంతులను అంతే వేగంతో అభిషేక్ బౌండరీలకు తరలించాడు. జోరు మీద కనిపించిన అభిషేక్‌ను రెండో ఓవర్‌లో వుడ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆర్చర్ వేసిన ఆ మరుసటి ఓవర్‌లోనే శాంసన్(5) భారీ షాట్ ఆడబోయి బౌండరీ దగ్గర కార్స్‌కు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో 19 పరుగులకే టీమ్‌ఇండియా ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. వచ్చి రావడంతోనే కెప్టెన్ సూర్యకుమార్..ఆర్చర్‌ను ఫోర్లతో అరుసుకున్నాడు. మరో ఎండ్‌లో తిలక్ కూడా తానేం తక్కువ కాదన్నట్లు ఆర్చర్ వేసిన ఐదో ఓవర్‌లో 4, 6, 6తో చెలరేగడంతో 17 పరుగులు వచ్చి చేరాయి. బౌలింగ్ మార్పుగా వచ్చిన కార్స్‌కు వర్మ సిక్స్‌తో స్వాగతం పలికాడు. ఇన్నింగ్స్ గాడిలో పడిందనుకున్న తరుణంలో ఎనిమిది బంతుల తేడాతో సూర్యకుమార్‌తో పాటు జురెల్(4) వెంటవెంటనే ఔటయ్యారు. దీంతో 66 పరుగులకే టీమ్ ఇండియా 4 వికెట్లు కోల్పోయింది. ఆశలు పెట్టుకున్న పాండ్యా(7)ను ఓవర్టన్ పెవిలియన్ పంపడంతో భారత్ కష్టాలు రెట్టింపయ్యాయి. ఓవైపు వికెట్లు పడుతున్నా..తిలక్ తన పోరాటాన్ని నమ్ముకున్నాడు. 10 పరగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డ సుందర్..వుడ్ బౌలింగ్‌లో 6,4, 4తో చెలరేగాడు. సాఫీగా సాగుతున్న సమయంలో సుందర్‌ను ఔట్ చేసి కార్స్ మళ్లీ దెబ్బతీశాడు. దీంతో ఆరో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవైపు ఇంగ్లండ్ అన్నివైపులా నుంచి కత్తులు దూస్తున్నా..వెరవకుండా ఆఖరి వరుస బ్యాటర్లతో కలిసి తిలక్ జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు.

పడుతూ లేస్తూ:

గత మ్యాచ్‌ను తలపిస్తూ తన తొలి ఓవర్‌లోనే అర్ష్‌దీప్‌సింగ్(1/40)..సాల్(4)ను ఔట్ చేశాడు. డకెట్(3) కూడా నిరాశపర్చడంతో ఇంగ్లండ్ 26 పరుగులకే ఓపెనర్లు కోల్పోయింది. ఈ తరుణంలో కెప్టెన్ బట్లర్ జట్టును ఆదుకున్నాడు. భారత బౌలింగ్ దాడిని నిలువరిస్తూ స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. మిడిల్‌లో బ్రూక్(13), లివింగ్‌స్టోన్(13), ఓవర్టన్(5) విఫలమైనా ఆఖర్లో కార్స్(31) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు.

సంక్షిప్త స్కోర్లు:

ఇంగ్లండ్:20 ఓవర్లలో 165/9(బట్లర్ 45, కార్స్ 31, అక్షర్ 2/32, వరుణ్ 2/38), భారత్: 20 ఓవర్లలో 166/8(తిలక్ 72 నాటౌట్, సుందర్ 26, కార్స్ 3/29, రషీద్ 1/14)

క్వీన్ కీస్

ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కైవసం • ఫైనల్లో సబలెంకాపై సంచలన విజయం

నేడు సిన్నర్, జ్వెరెవ్ మధ్య ఫైనల్

విన్నర్: కీస్:19 కోట్లు
రన్నరప్: సబలెంక: 10 కోట్లు

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నయా చాంపియన్ దూసుకొచ్చింది. అంచనాలు లేకుండా బరిలోకి దిగి ఏకైక టైటిల్ ఎగరేసుకుపోయింది. మ్యాచ్ మ్యాచ్‌కు రాటుదేలుతూ తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడిన ఆ అమ్మాయే అమెరికా స్టార్ మాడిసన్ కీస్. శనివారం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో కీస్ 6-3, 2-6, 7-5తో డిఫెండింగ్ చాంపియన్ అరీనా సబలెంక(బెలారస్)కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. ముచ్చటగా మూడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలుద్దామనుకున్న సబలెంక ఆశలపై నీళ్లు గుమ్మరిస్తూ కీస్ సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంది. రెండు గంటల రెండు నిమిషాల పాటు సాగిన తుది పోరులో ఫెవరేట్‌గా బరిలోకి దిగిన సబలెంకకు కీస్ దీటైన పోటీనిచ్చింది. 6-3తో తొలి సెట్‌ను కైవసం చేసుకున్న కీస్..రెండో సెట్‌ను చేజార్చుకుంది. అయితే ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోని ఈ అమెరికా స్టార్ బలమైన బేస్‌గేమ్‌తో చెలరేగింది. మ్యాచ్‌లో ఆరు ఏస్‌లు కొట్టిన కీస్ ఒక డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. అదే సమయంలో 29 విన్నర్లతో పాటు 4బ్రేక్ పాయింట్లను కాపాడుకుంది. కీస్ నుంచి ఇంతటి పోటీని ఊహించని సబలెంక నాలుగు డబుల్ ఫాల్ట్స్, 13సార్లు అనవసర తప్పిదాలు చేసింది. ఒక దశలో సహనం యిన ప్రపంచ నంబర్‌వన్ నెట్ వద్ద తప్పులు మూల్యం చెల్లించుకుంది. 29 ఏండ్ల వయసులో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన కీస్‌కు ఇది 46వ స్లామ్ మ్యాచ్. పెన్నెట్టా(49), మరియన్ బర్తోలి(47) తర్వాత ఎక్కువ మ్యాచ్‌లు ఆడి టైటిల్ గెలిచిన ప్లేయర్‌గా కీస్ నిలిచింది. దీనికి తోడు ప్లావియా పెనెట్టా(33 ఏండ్లు) తర్వాత గ్రాండ్‌స్లామ్ గెలిచిన ప్లేయర్‌గాను గుర్తింపు పొందింది.

శ్రీనిధికి చుక్కెదురు

బెంగళూరు: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ ఒడిదొడుకుల పయనం కొనసాగుతున్నది. శనివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి ఎఫ్‌సీ 0-1తో స్పోర్టింగ్ క్లబ్ బెంగళూరు చేతిలో ఓటమిపాలైంది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు తరపున అసిఫ్(34ని) ఏకైక గోల్ చేశాడు. ఈ మ్యాచ్ కోసం శ్రీనిధి ఎఫ్‌సీ మూడు మార్పులు చేసినా లాభం లేకపోయింది. లీగ్‌లో ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లాడిన శ్రీనిధి జట్టు 11 పాయింట్లతో 9వ స్థానంలో కొనసాగుతున్నది.

ఒక్కరోజే 20 వికెట్లు

ముల్తాన్: పాకిస్థాన్, వెస్టిండీస్ మధ్య శనివారం మొదలైన రెండో టెస్టులో ఒక్క రోజే 20 వికెట్లు నేలకూలాయి. తొలుత నోమన్ అలీ(6/41) ధాటికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 163 పరుగులకే కుప్పకూలింది. అలీ స్పిన్ విజృంభణతో 54 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన విండీస్‌ను గుడకేశ్ మోతీ(55), జోమెల్ వారికన్(36 నాటౌట్), కీమర్ రోచ్ (25) ఆదుకున్నారు. టెస్టుల్లో హ్యాట్రిక్ తీసిన తొలి పాక్ స్పిన్నర్‌గా అలీ రికార్డుల్లోకెక్కాడు. ఆ తర్వాత వారికన్(4/43), మోతీ(3/49) విజృంభణతో పాక్ 154 పరుగులకు పరిమితమైంది. రిజ్వాన్(49) ఆకట్టుకున్నాడు.

శ్రీజేశ్‌కు పద్మభూషణ్

అశ్విన్‌కు పద్మశ్రీ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని దశదిశలా ఇనుమడింపజేసిన క్రీడాకారులకు సముచితం గౌరవం దక్కింది. హాకీకి అసమాన సేవలు అందించిన భారత మాజీ కెప్టెన్ పీఆర్ శ్రీజేశ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ అవార్డుకు ఎంపిక చేసింది. టోక్యో(2020) ఒలింపిక్స్‌తో పాటు పారిస్(2024) విశ్వక్రీడల్లో భారత హాకీ జట్టు కాంస్య పతకాలు సాధించడంలో శ్రీజేశ్ కీలక పాత్ర పోషించాడు. గ్రేట్ వాల్ ఆఫ్ ఇండియాగా నిలుస్తూ ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నంలా నిలిచాడు. టెస్టుల్లో భారత్ తరపున 537 వికెట్లు తీసిన దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యాడు. తన స్పిన్ నైపుణ్యంతో అశ్విన్ ఎన్నో చిరస్మరణీయ విజయాలందించాడు. వీరికి తోడు భారత దిగ్గజ ఫుట్‌బాలర్ విజయన్, పారాలింపిక్ స్వర్ణ విజేత హర్విందర్‌సింగ్, పారా అథ్లెటిక్స్ కోచ్ సత్యపాల్ సింగ్..పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు.

ప్రణవ్‌కు పసిడి

ఖేలో ఇండియా వింటర్‌గేమ్స్

లేహ్(లడఖ్): జమ్ము కశ్మీర్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో తెలంగాణ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. శనివారం జరిగిన పురుషుల 500 మీటర్ల ఐస్ స్కేటింగ్‌లో తెలంగాణ యువ స్కేటర్ సూరపనేని ప్రణవ్ మాధవ్ పసిడి పతకంతో మెరిశాడు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో ప్రణవ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. రేసును 56.86సెకన్లలో ముగించిన ప్రణవ్ అగ్రస్థానంలో నిలువగా, సమ్రుద్(1:00:31సె, కర్నాటక), సుమిత్ తప్కిర్(1:00:58సె, మహారాష్ట్ర) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. టోర్నీలో ప్రస్తుతం రెండు స్వర్ణాలు దక్కించుకున్న తెలంగాణ టాప్‌లో కొనసాగుతున్నది. మరోవైపు పురుషుల ఐస్ హాకీలో ఉత్తరాఖండ్ 6-0తో హిమాచల్‌ప్రదేశ్‌పై విజయాలు సాధించాయి.

నితీశ్‌కు గాయం

ముంబై: ఆల్‌ఫార్మాట్ ప్లేయర్‌గా ఎదుగుతున్న తెలుగు యువ ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్‌రెడ్డి గాయం కారణంగా ఇంగ్లండ్ సిరీస్‌కు పూర్తిగా దూరమయ్యాడు. చెన్నైలో రెండో టీ20 కోసం ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో గాయపడ్డ నితీశ్ మిగతా మ్యాచ్‌లకు అందుబాటులో లేకుండా పోయాడు. పక్కటెముకల గాయంతో బాధపడుతున్న నితీశ్ గాయం నుంచి కోలుకునేందుకు బెంగళూరులోని సెంటర్ ఎక్సలెన్సీలో పునరావాసం పొందనున్నాడు. గాయపడ్డ నితీశ్ స్థానంలో ముంబై ఆల్‌రౌండర్ శివమ్‌దూబేకు సెలెక్టర్లు చాన్స్ ఇచ్చారు. మరోవైపు ప్రాక్టీస్ సందర్భంగా వెన్నునొప్పి బారిన పడ్డ రింకూ సింగ్..రెండు, మూడు టీ20లకు అందుబాటులో లేకుండా పోయాడు. రింకూ స్థానంలో రమణ్‌దీప్‌సింగ్‌ను రిజర్వ్‌గా ఎంపిక చేశారు.

టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అర్ష్‌దీప్

కెప్టెన్‌గా రోహిత్‌శర్మ

దుబాయ్: టీమ్‌ఇండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్‌సింగ్ ప్రతిష్ఠాత్మక ఐసీసీ టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును కైవసం చేసుకున్నాడు. శనివారం ఐసీసీ ప్రకటించిన అవార్డు జాబితాలో అర్ష్‌దీప్‌కు చోటు దక్కింది. తన స్వింగ్ బౌలింగ్‌తో పొట్టి ఫార్మాట్‌లో వికెట్ల వేట కొనసాగిస్తున్న అర్ష్‌దీప్ అనతికాలంలోనే అత్యుత్తమ బౌలర్‌గా ఎదిగాడు. నిరుడు వెస్టిండీస్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్‌ను భారత్ గెలువడంలో ఈ పంజాబ్ పేసర్‌ది కీలక పాత్ర. మెగాటోర్నీలో 8 మ్యాచ్‌ల్లో 12.64 సగటుతో సింగ్ 17 వికెట్లు పడగొట్టి టాప్‌లో నిలిచాడు. ఐసీసీ టీ20 టీమ్‌కు కెప్టెన్‌గా రోహిత్‌శర్మ ఎంపికవ్వగా భారత్ నుంచి అర్ష్‌దీప్‌సింగ్, బుమ్రా, హార్దిక్‌పాండ్యా చోటు దక్కించుకున్నారు. మహిళల టీ20 టీమ్‌కు మంధాన, రీచా, దీప్తిశర్మ ఎంపికయ్యారు.

మన రాజ్యాంగం అమల్లోకి వచ్చి
75 ఏళ్ళు పూర్తయిన వేళ
76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా
దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు

"దేశంలోని నా కుటుంబ సభ్యులందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. భారత ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడంలో మన రాజ్యాంగం కీలక పాత్ర పోషించింది ఆటంకాలు, అవరోధాలు, సవాళ్ళను అధిగమిస్తూ ధృఢ సంకల్పంతో దేశం ముందుకు సాగుతోంది."
జై హింద్!
- నరేంద్ర మోడి

దూరదర్శన్ నెట్‌వర్క్‌లో ఉదయం 9 గంటల నుండి కర్తవ్య పథ్ నుంచి గణతంత్ర దినోత్సవ ప్రత్యక్ష ప్రసారం